క్లుప్తంగా

ఉత్తమ సేవలకు ప్రశంస



దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నంని జిల్లా పరిషత్ అధికారులు బుధవారం సన్మానించారు. కేసానుపల్లిలో మెరుగైన పారిశుద్ధ్యం పనులు చేపట్టటం, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచటంలో పంచాయతీ కార్యదర్శి రత్నం కీలకపాత్ర పోషించారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుగా ఉండటంతో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు చేతుల మీదుగా రత్నం ఈ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, ఎంపీటీసీ చెట్టిపాగు ఏసుదాసు పంచాయతీ కార్యదర్శి రత్నంని అభినందించారు.

పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోండి

ఎంఈవో వేముల నాగయ్య



మాచర్ల: రాష్ట్రంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 2024 విద్యా సంవత్సరంలో అన్ని ప్రైవేటు, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యా హక్కుచట్టం 2009 సెక్షన్ 12 ప్రకారం విద్యార్థుల ఆధార్ ప్రాథమిక వివరాలతో అర్హులకు 1వ తరగతిలో 25% ఉచిత సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించారని మాచర్ల మండల విద్యాశాఖాధికారి వేముల నాగయ్య చెప్పారు. బుధవారం ఎంఈవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మార్చి 14 వరకు విద్యా హక్కు చట్టం కింద నివాసిత ప్రాంత సమీపంలో ప్రైవేటు, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో అవకాశం కల్పించటం జరిగిందని అన్ని వర్గాలు సద్వినియోగం చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఎంఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నేడు శివరాత్రి ఏర్పాట్లపై సమీక్షా సమావేశం

రెంటచింతల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సత్రశాలలోని గంగా మల్లిఖార్జున స్వామి దేవస్థానం ఆవరణలో గురువారం సాయంత్రం 4 గంటలకు సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు బుధవారం తెలిపారు. దేవదాయశాఖాధికారులు, మండలస్థాయి వివిధ శాఖాధికారులు, మాచర్ల ఆర్టీసీ బస్‌డిపో మేనేజర్, స్థానిక ప్రజాప్రతినిధులు, దేవస్థానం పాలకవర్గం సభ్యులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇన్‌చార్జి ఎంపీపీగా సంజీవరెడ్డి



వెల్దుర్తి: వెల్దుర్తి మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపీపీగా అలుగుమల్లి సంజీవరెడ్డి గురువారం పదవీ బాధ్యతలను చేపట్టనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు కె.పాపిరెడ్డి బుధవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సంజీవరెడ్డి బాధ్యతలు చేపడతారన్నారు.

నేడు, రేపు వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి తిరునాళ్ల గురు, శుక్రవారాలు రెండు రోజులు జరగనుంది. గురువారం వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల కల్యాణం, ఆలయ ప్రాంగణంలో ఉన్న శివాలయంలో శివపార్వతుల కల్యాణం జరుగుతుంది. కల్యాణోత్సవాలలో గ్రామస్తులు పాల్గొని వీరబ్రహ్మేంద్ర స్వామిగోవిందమాంబలకు పూజలు చేస్తారు. శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలు అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయి. వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్లను గ్రామ తిరునాళ్లగా వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

నేడు వేణుగోపాలస్వామి వార్ల కల్యాణ మహోత్సవం

మిట్టగుడిపాడు(రెంటచింతల): మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామివారి 19వ వార్షిక కల్యాణ మహోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు రమణాచార్యులు బుధవారం తెలిపారు. ఉదయం 7 గంటలకు హోమాలు, 9.30 గంటలకు పంచామృతాభిషేకం, 11 గంటలకు స్వామివారి శాంతి కళ్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. 12 గంటలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

సంక్షేమం, అభివృద్ధితో మారిన కేసానుపల్లి రూపురేఖలు

- రూ. 27కోట్లతో సంక్షేమ పథకాలు.. రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనితీరు బాగుందంటున్న గ్రామస్తులు



కేసానుపల్లి గ్రామ సచివాలయం

దాచేపల్లి : సున్నపురాయి ఖనిజ నిల్వలకు ఖిల్లాగా ఉన్న కేసానుపల్లి అభివృద్ధి బాట పట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందింది. దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు ఈ గ్రామానికి ప్రజాప్రతినిధులుగా ఉండగా...ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి చేయటంలో మేము తక్కువకాదని నిరూపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమం, అభివృద్ధి తారాస్థాయిని తాకింది. ఈ గ్రామంలో రూ.40 కోట్ల మేర అభివృద్ధి, సంక్షేమం జరిగింది.

గడప గడపకు సంక్షేమం..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ గ్రామంలో సంక్షేమం ప్రతి గడపని తాకింది. గత ప్రభుత్వంలో పథకాలు టీడీపీ కార్యకర్తలకే అందాయి. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలు, కులాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందటంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు.
సంక్షేమ పథకాల ద్వారా రూ.27,35,51,472 ప్రజలకు లబ్ధి జరిగింది.

అభివృద్ధి ఇలా..

- రూ.45 లక్షలతో గ్రామ సచివాలయం
- రూ.18 లక్షలతో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం
- రూ.22 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించారు.
- రూ.1.90 కోట్లతో నాడు-నేడు ద్వారా కేజీబీవీ, ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేశారు.
- రూ.6 లక్షలతో పబ్లిక్ టాయిలెట్స్, రూ.35 లక్షలతో ఎస్సీ, బీసీ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం.
- రూ.1.50 కోట్లతో ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు పైపులైన్ పనులు.



నాడు-నేడు ద్వారా ఆధునికరించిన కేజీబీవీ

- రూ.20 లక్షలతో గ్రావెల్ రోడ్లు, రూ.1.05 కోట్లతో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో సిమెంట్ రోడ్లు నిర్మాణం.
- రూ.10 లక్షలతో మంచినీటి బోర్లు కలిపి మొత్తంగా రూ.6.01కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి.

మా సమస్య తీర్చింది ఈ ప్రభుత్వమే..



నాకు ఊహ తెలిసినప్పటి నుంచి మా వీధి అధ్వానంగా ఉంది. ఎంతమందికి చెప్పినా రోడ్డు వేస్తామని చెప్పిన వాళ్లే కానీ ఒక్కరూ వేయలేదు. మా వీధికి వచ్చిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని సిమెంట్ రోడ్డు వేయమని అడిగాం. రూ.30 లక్షలతో సిమెంట్ రోడ్డు వేయించారు. ఈ ప్రభుత్వం చల్లగా ఉండాలి.
ఉల్లేరు సైదమ్మ, కేసానుపల్లి

మేము ఊహించని అభివృద్ధిని చూశాం..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాకు సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం వచ్చింది. ఏకగ్రీవంగా సర్పంచ్‌గా గెలిచి గ్రామం అభివృద్ధికి పాటుపడ్డాను. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో రూ.6 కోట్ల అభివృద్ధి పనులు చేసి రూ.27.35 కోట్ల సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందించాం. జగనన్న ప్రభుత్వంలో నేను ఊహించినదానికంటే ఎక్కువగా అభివృద్ధి చేశాం.
– వినుకొండ కోటేశ్వరరావు, సర్పంచ్, కేసానుపల్లి

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ



నగర పంచాయతీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ

దాచేపల్లి : అభివృద్ధి పథంలో నగర పంచాయతీ పయనిస్తుందని, నగర పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అన్నారు. సచివాలయం-1లో నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ సుబ్బమ్మ అధ్యక్షతన బుధవారం జరిగింది. వేసవి నేపథ్యంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్న వార్డుల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుబ్బమ్మ మాట్లాడుతూ తాగునీటి సమస్యపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఎంత ఖర్చయిన వెనకడుగు వేయకుండా నీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. జియాలజిస్టుల సూచనలు మేరకు బోర్లు వేసి నీటిని సరఫరా చేస్తామని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నగర పంచాయతీ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా మంజూరైన రూ.16.50 కోట్లతో పైపులైన్ పనులు చేపట్టి ఇంటింటికి తాగునీరు అందించే చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేలా పని చేస్తున్నామని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో డీఈ వి.సత్యనారాయణ, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్ బాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, కౌన్సిలర్లు చాట్ల క్రాంతికుమార్, శ్రీరాం పోలు, నాగుబండి గురువులు, మందపాటి వీరారెడ్డి, దేవళ్ల లక్ష్మీప్రసన్న, ఈదా వెంకటరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ రఫీ, గుంజా వెంకటప్పయ్య, వేల్పుల అంజమ్మ పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు



ఉత్తమ టైలర్స్‌కు సన్మానం



విలియమ్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దర్జీలు



విలియం హోవేకి నివాళులర్పిస్తున్న టైలర్స్

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని జాతీయస్థూపం వద్ద బుధవారం టైలర్స్ యూనియన్ వెల్ఫేర్ సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలు దర్జీలు ఘనంగా నిర్వహించారు. కుట్టుమిషన్ కనుగొన్న శాస్త్రవేత్త విలియం హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టైలర్ సంఘం నాయకులు మాట్లాడుతూ చేతివృత్తి మీద ఆధారపడి సమాజంలో గౌరవప్రదంగా జీవిస్తున్న దర్జీలు శాస్త్రవేత్త విలియమ్స్‌ను ఎప్పటికీ మరువరన్నారు. ఈ కార్యక్రమంలో కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాసరావు, టైలర్స్ యూనియన్ వెల్ఫేర్ సంఘం అధ్యక్షులు ఎన్.రంగా, సభ్యులు చంద్రం, కిశోర్, తిరుపతిరావు, మస్తాన్, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, పీటర్ పాల్, రామకోటి పాల్గొన్నారు.

మాచర్లలో ఘనంగా టైలర్స్ డే

మాచర్ల: పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ బిల్డింగ్‌లో కీర్తిశేషులు పఠాన్ బుడేసాహెబ్ జ్ఞాపకార్థం రోటరీ క్లబ్, మాచర్ల ఆధ్వర్యంలో బుధవారం టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. నూతనంగా వస్తున్న సాంకేతిక అంశాలను వినియోగించుకొని టైలర్స్ మరింత వృద్ధి చెందాలని జిల్లా కమీటీ సభ్యులు డాక్టర్ రామకోటయ్య, బుడేసాహెబ్ కుమారుడు పఠాన్ నాగూర్‌వలి అన్నారు. టైలర్ వృత్తిలో ప్రతిభ చూపేవారిని అభినందిస్తూ మరింత ఉన్నత స్థితికి చేరుకోవాలని అసిస్టెంట్ గవర్నర్ ఇక్కుర్తి శంకర్ అన్నారు. ఈ సందర్భంగా సీనియర్ టైలర్స్ ఎం.కోటయ్య చారి, ఎం.విజయలక్ష్మి, అలవాల వెంకటేశ్వర్లు, తాటిపర్తి శేషారెడ్డి, అత్తూరి సుభాని, రెంబాలపల్లి భాస్కర్‌లను రోటరీ క్లబ్ అధ్యక్షులు చిన్ని సత్యనారాయణ, కార్యదర్శి పఠాన్ నాగూర్‌వలి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టైలర్లతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు. ముందుగా టైలరింగ్ వృత్తిలో విశేష కృషి చేసి కీర్తిశేషులైన పఠాన్ బుడేసాహెబ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని ఆర్యవైశ్య వృద్ధాశ్రమంలో వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు ఆధ్వర్యంలో పలువురు టైలర్స్‌ను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం టైలర్స్ చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వ్యవస్థాపక అధ్యక్షులు వెంకట నాగేశ్వరరావు, పిచ్చయ్య, నాగేశ్వరరావు, రాజ్‌కుమార్, వెంకటలక్ష్మి, సత్యనారాయణ తదితరులున్నారు.

కారెంపూడిలో టైలర్స్ డే

కారెంపూడి: మండలంలో బుధవారం టైలర్స్ డే ఘనంగా జరుపుకున్నారు. కుట్టుమిషన్ కనిపెట్టిన విలియం హోవేకి ఘనంగా జోహార్లు అర్పించారు. స్థానిక చెన్నకేశవస్వామి దేవాలయంలో టైలర్స్ సమావేశమై విలియం హోవే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మొదట కారెంపూడిలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వెంకటేష్, జిల్లా సభ్యులు షేక్ నజీర్, ఎం.వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షులు అక్బర్‌వలి, ఉపాధ్యక్షుడు మస్తాన్‌వలి, కార్యదర్శి బి.శంకర్, వెంకటేశ్వర్లు, శ్రీను, సైదా పాల్గొన్నారు.

జీవిత గమనంలో సైన్స్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉంది

నోబెల్ గ్రహీత సి.వి.రామన్‌కు నివాళి



జెట్టిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో సైన్స్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు



సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న సీఐ శరత్‌బాబు



సి.వి.రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయి

జెట్టిపాలెం(రెంటచింతల): సైన్స్‌లో ప్రయోగాలు చేసి దేశ ప్రతిష్టను పెంచి నోబెల్ బహుమతిని పొందిన తొలి భారతీయుడు, మహాజ్ఞాని సి.వి.రామన్‌ను విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకోవాలని జెట్టిపాలెం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.పాపయ్య అన్నారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని జెట్టిపాలెం గ్రామ శివారు ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన జీవిత గమనంలో సైన్స్ ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉందని వివరించారు. కాంతిపై చేసిన ప్రయోగాలద్వారానే డాక్టర్ సి.వి.రామన్‌కు నోబెల్ బహుమతి పొందారన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులలో దాగిన ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించాలన్నారు. లక్ష్యంతో చదివినవారు జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకుంటారన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలలోని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాచర్లలో సైన్స్ డే

మాచర్ల: సైన్స్ అనేది మూలం అని, సైన్స్‌పై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని, ఇందుకు శాస్త్రవేత్త స్వర్గీయ అబ్దుల్ కలాం, సీవీ రామన్‌లు ఆదర్శమని, అర్బన్ సీఐ పి.శరత్‌బాబు అన్నారు. పట్టణంలోని కృష్ణవేణి స్కూల్‌లో బుధవారం నిర్వహించిన సైన్స్ డేకు సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తన చిన్నతనంలోని స్కూల్ డేస్ గుర్తుకొస్తున్నాయన్నారు. చిన్నారులు చదువుతో పాటు వైజ్ఞానిక శాస్త్ర రంగాలలో రాణించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సైన్స్ నమూనాల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, అడ్మినిస్ట్రేషన్ అధికారి శ్రీధర్ గుప్తా, డా.సదాశివరాజ్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

మాచర్ల: భారతదేశ చరిత్రలో క్రాంతికిరణాల ప్రభావంపై ప్రయోగాలు చేసి నోబెల్ బహుమతి సంపాదించిన సైన్స్ మేధావి సి.వి.రామన్ అని, ఆరాధ్య దైవమని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అన్నారు. బుధవారం చక్రధర్ డిగ్రీ కళాశాలలో జరిగిన సైన్స్ డే వేడుకలలో ముందుగా సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్ ప్రాముఖ్యత గురించి పలువురు ప్రముఖులు వివరించారు. కార్యక్రమంలో మాదాసు రాజబాబు, యేలూరి నాగరాజు, నవీన్ రెడ్డి, గురవయ్య, జ్యోతి, లక్ష్మీ ప్రసన్న, లక్ష్మీ దుర్గ, రాణి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు బోర్లు ఏర్పాటు



వెల్దుర్తి: మండలంలోని గంగలకుంట గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఐదు బోరుబావులను వేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు సబ్బసాని కోటిరెడ్డి బుధవారం తెలిపారు. గ్రామంలో ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటుండటంతో పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లటంతో గ్రామంలో ఐదు బోర్లు మంజూరు చేయించారన్నారు. త్వరలోనే బోరు, మోటార్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పూర్తిగా నివారిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మేడబోయిన కోటయ్య, మేడబోయిన కృష్ణ, మాజీ సర్పంచ్ కాటంరాజు తదితరులు పాల్గొన్నారు.

సురక్ష వైద్య శిబిరంలో 423 మందికి వైద్య సేవలు



పిడుగురాళ్ల: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం బుధవారం పట్టణ 15వ సచివాలయం పరిధిలో శివాలయం సమీపంలోని బ్రహ్మంగారి గుడి ఆవరణలో నిర్వహించారు. ఈ శిబిరంలో 25, 27 వార్డులకు చెందిన ప్రజలకు వైద్య సేవలు నిర్వహించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు పత్రా అనిల్ కుమార్ మాట్లాడుతూ పేద ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పూర్తి స్థాయిలో సద్వినియోగించుకుంటున్నారని తెలిపారు. వైద్య శిబిరంలో సుమారు 423 మందికి వైద్య సేవలు. ఉచితంగా మందులు అందించడం జరిగిందని చెప్పారు. వైద్యులు అమరేశ్వరరెడ్డి, రవితేజ, గిరిరాజు, సూపర్ వైజర్లు రాజ్యలక్ష్మి, సీతారామయ్య, సుజాత, చిరంజీవి, సుధారాణి, పావని, ఛాయరత్నం, వైద్య, సచివాలయసిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతం చేయాలి



ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో సమావేశంలో మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో మార్చి 3న నిర్వహిస్తున్న సామూహిక పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆరోగ్య, ఆశా కార్యకర్తలు విజయవంతం చేయాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి కోరారు. బుధవారం స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు అధ్యక్షతన ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాలలో 0–5 సంవత్సరముల లోపు పిల్లలు మొత్తం 3,624 మంది ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. మార్చి 3న ఏర్పాటు చేసే శిబిరంలో ఆరోగ్య, ఆశా కార్యక్తలు కచ్చితంగా పాల్గొని పోలియో చుక్కలు వేయించాలన్నారు. జాతీయ కార్యక్రమంగా తలపెట్టిన ఈ పోలియో చుక్కల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శంకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, ఆరోగ్య, ఆశా కార్యక్తలు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థిని ఆత్మహత్య



మృతి చెందిన కొనకండ్ల రిషిత

పిడుగురాళ్ల: పదోతరగతి విద్యార్థిని భవనం నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో బుధవారం జరిగింది. ఘటనకు సంబంధించి బంధువులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని కొనకండ్ల రామలింగేశ్వరరావు కుమార్తె రిషిత(14) 10వ తరగతి చదువుతుంది. మూడవ అంతస్తులో క్లాస్ జరుగుతుండగా భవనం నుంచి ఒక్క సారిగా దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అయితే కొన్ని నెలలుగా రిషిత మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు హాస్పిటల్లో వైద్యం పొందుతుందని, 10వ తరగతి పరీక్షలు దగ్గర పడుతుండటంతో రిషిత తండ్రి గత రెండు వారాల నుంచి స్కూల్‌కు పంపుతున్నారు. కాగా స్కూల్లో 3వ అంతస్తు నుంచి ఒక్కసారిగా దూకింది. అయితే రిషిత నోట్ పుస్తకంలో మాత్రం మిస్ యూ.. మై ఫ్యామిలీ.. మిస్ యూ సో మచ్ సిస్టర్ అని రాసి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. విద్యార్థినిని హుటాహుటిన ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న బృహత్తర అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై మండలంలోని గంగలకుంట గ్రామానికి చెందిన కంపసాటి గోవిందు, కంపసాటి చిన వీరయ్య, కంచర్ల వెంకటేశ్వర్లుతో పాటు మరో 7 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో బుధవారం చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ సీఎం జగన్ బడుగు, బలహీన వర్గాల పట్ల ఎంతో అభిమానంతో ఉన్నారన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చటంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. జగన్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జరుగుతున్నాయన్నారు. పార్టీలో చేరిన వారికి అన్ని విధాలా సహకరిస్తానన్నారు. సీఎం జగన్‌కు అందరం మద్దతుగా నిలిచి మరలా ఆయనను ముఖ్యమంత్రి చేసేంత వరకు రాబోయే ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదినారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.